భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



దేవరకద్ర పోచమ్మ ఆలయం వద్ద వేడుకలు



జిల్లాకేంద్రంలో ద్వారకామయిలో ..



జిల్లాకేంద్రంలో వనదుర్గ అలంకరణలో అమ్మవారు

సాక్షినెట్‌వర్క్ : శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.

● పాలమూరు పట్టణంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బ్రాహ్మణవాడి వాసవీ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. వీరన్నపేట తదితర చోట్ల వేడుకలు కొనసాగుతున్నాయి.

● జడ్చర్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయం, గౌరీ శంకర్‌కాలనీల్లో అమ్మవారికి పూజలు చేశారు.

● దేవరకద్రలో సోమవారం దుర్గామాతను గాయత్రీదేవిగా అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. మండపాల వద్ద బతుకమ్మ ఆడారు.

● నవాబుపేట మండల పరిధిలోని మైసమ్మ ఆలయంతో పాటు, మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, గ్రామాల్లో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేస్తున్నారు. మండపాల వద్ద అన్నదానం చేపట్టారు.

● భూత్పూర్ పరిధిలో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమిస్తాపూర్ సాక్షి గణపతి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపం వద్ద ముడా డైరెక్టర్ సాయిలు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు.



దేవరకద్ర దళితవాడలో..



పర్వతాపూర్‌లో..



అమిస్తాపూర్‌లో సాక్షి గణపతి దేవాలయంలో ..



జిల్లాకేంద్రంలోని గణేష్‌నగర్‌లో..



కావేరమ్మపేటలో..



అడ్డాకులలో..

క్లుప్తంగా

ముమ్మరంగా తనిఖీలు

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో సోమవారం భూత్పూర్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ పి.శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. రూ.50వేలకు మించి డబ్బును ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్లరాదని అన్నారు.

సౌకర్యాలపై ఆరా

బాలానగర్: అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణ కోసం ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ యాదయ్య ఆదేశించారు. సోమవారం డీపీఓ వెంకటేశ్వర్లుతో కలిసి మండల పరిధిలోని బోడజానంపేట్, చిన్నరేవల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన అక్కడ అవసరమైన ర్యాంప్ ఇతర పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. వారి వెంట ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ విజయ తదితరులు ఉన్నారు.

పోటీ చేసేందుకు అవకాశం కల్పించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని రాఘవేందర్ సోమవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ నుంచి వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకుడు మహ్మద్ వాజిద్ సోమవారం దరఖాస్తు చేసుకున్నారు.

నేడు నాటక ప్రదర్శన

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో మంగళవారం సాయంత్రం సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తున్నట్లు రత్నమాల బ్రహ్మనందచారి సంగీత నాటక అకాడమీ గౌరవ అధ్యక్షుడు టి. మురళీధర్ గౌడ్ తెలిపారు. రెండవ ప్రదర్శన19న భూత్పూర్‌లో శ్రీకృష్ణ రాయబారం, మూడవ ప్రదర్శన 21న శేరిపల్లి (బి)లో శ్రీకృష్ణ రాయబారం పూర్తి నాటకం ప్రదర్శిస్తున్నట్లు వివరించారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

భూత్పూర్: ఎల్కిచర్లకి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గోసుల నారాయణ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం రాత్రి నారాయణ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఎల్కిచర్లకు వచ్చి సంతాపం తెలిపారు. వారి వెంట నాయకులు తదితరులు ఉన్నారు. కాగా నెల రోజుల క్రితం నారాయణ రెండో కుమారుడు నరేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. నెల వ్యవధిలోనే కుటుంబంలో తండ్రి, కుమారుడు మృతిచెందడటంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

కూర్చున్నచోటే కుప్పకూలిన పండ్ల వ్యాపారీ

జడ్చర్ల: స్థానిక నేతాజీ చౌరస్తా-సిగ్నల్ గడ్డ ప్రధాన రహదారి పక్కన బండిపై పండ్లు అమ్ముకుని జీవనోపాధి పొందుతున్న మున్న (60) ఆకస్మికంగా కూర్చున్న చోటే కుప్పకూలి మృత్యువాత పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అడ్డాకులకు చెందిన మున్న స్థానిక పాతబజార్‌లో నివాసం ఉంటూ పండ్లు అమ్ముకుంటూ జీవనం గడుపుతున్నట్లు తోటి పండ్ల వ్యాపారులు తెలిపారు. ఆకస్మికంగా కుప్పకూలడంతో 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చే సరికే అతను మృతిచెందినట్లు వివరించారు.

ఖాళీ జాగా.. వేసేయ్‌పాగా!



రాజాపూర్: భూముల ధరలు విపరీతంగా పెరగడంతో గ్రామాల్లో సైతం ఖాళీ జాగా కనిపిస్తే అక్రమార్కులు వదలడం లేదు. రాత్రికి రాత్రి కబ్జాలకు పాల్పడుతున్నారు. మండలంలోని కల్లేపల్లిలోనూ అలాంటి పరిస్థితే కనిపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కొందరు ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రభుత్వ భూమి అయిన సర్వే నెంబర్ 1లో ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధపడుతున్నారని చెబుతున్నారు. గతంలో గ్రామంలో కల్లాలకోసం ప్రభుత్వ భూమిలో కొంత స్థలాన్ని వదిలారని, అక్కడ ఏటా వరి కొనుగోళ్లను నిర్వహిస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం కొందరు రాత్రివేళల్లో పునాదులు తీస్తున్నారని అంటున్నారు. ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టొద్దని పలువురు గ్రామస్తులు అడ్డుకున్నా లెక్క చేయకుండా ఆదివారం రాత్రి కొందరు పునాదులు తీశారు. దీంతో వారు స్థానిక తహసీల్దార్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. సర్పంచ్ బాలమణి సైతం సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డిలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఎలక్షన్ కోడ్ అమలులో ఉందని, ప్రభుత్వ భూమిలో పునాదులు తీస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐని పంపించి గ్రామస్తులకు వివరించామని తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సుశీల

రాజాపూర్: సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ అధ్యక్షురాలు సుశీల ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ నివేదికను చదివి వినిపించారు. కాగా రుణమాఫీ అందరికీ ఎందుకు కాలేదని సర్పంచ్‌లు అడిగారు. అయితే తమ చేతుల్లో ఏమీ లేదని ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంటుందని ఆయన సమాధానం ఇచ్చారు. గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి పేర్కొన్నారు. రాజాపూర్ ప్రభుత్వ వైద్యశాలలో మూడు నెలల నుంచి ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు, షుగర్‌పేషంట్స్‌కి రక్త పరీక్షలు చేసేవారులేక ఇబ్బందులు పడుతున్నారని వైద్యాధికారి మధుసూదన్‌రావ్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించకున్న నిర్వహిస్తున్నట్లు ఎజెండాలో ఎలా రాస్తారని రాయపల్లి సర్పంచ్ గంగాధర్‌గౌడ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలని ప్రతి సమావేశంలో కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

సాక్షినెట్‌వర్క్: బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దేవరకద్రలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా మేనిఫెస్టో ఉందన్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మవద్దని, కర్ణాటకలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని ఆయన సతీమణి మంజుల అన్నారు. భూత్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

● ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నిరంతర కృషితో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్‌రెడ్డి, మహిమూద్, నరేందర్, ఖాజాషెరీఫ్, బాలరాజు, మహేష్ తదితరులు ఉన్నారు.

● సీఎం కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టోను చూసి ప్రతిపక్షాలకు దిమ్మ తిరుగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ అన్నారు. మూసాపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్ష్మీనర్సింహ, భాస్కర్‌గౌడ్, కొండయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నచింతకుంటలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు మేనిఫెస్టో చూసి భయపడుతున్నాయని అన్నారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోట రాము తదితరులు ఉన్నారు.

● సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను అమలు చేసి తీరుతాడని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్ అన్నారు. సోమవారం భూత్పూర్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఒకసారి ఆశీర్వదించి గెలిపించండి

జడ్చర్ల టౌన్: రాబోయే ఎన్నికల్లో ఒకసారి ఆశీర్వదించి కాంగ్రెస్‌ను గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని పాతబజార్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: కాంగ్రెస్ పథకాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలని రంగారెడ్డిగూడ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి అన్నారు. సోమవారం ముదిరెడ్డిపల్లిలో పథకాలపై గ్రామస్తులకు వివరించారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్య, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు తరలి రావాలి



జడ్చర్ల టౌన్: నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 13, 23 వార్డుల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా సభకు రావటంతోపాటు బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఆయా వార్డుల పెద్దలు, యువకులు లక్ష్మారెడ్డికి మాటిచ్చారు.

మిడ్జిల్: జడ్చర్లలో ఈనెల 18న ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు మిడ్జిల్ నుంచి వేలాదిగా ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎంపీపీ సుదర్శన్ సూచించారు. సోమవారం గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పాండుయాదవ్ పాల్గొన్నారు.

నవాబుపేట: జడ్చర్లలో సభకు భారీగా జనం తరలనున్నట్లు మండల అధ్యక్షుడు నర్సింహులు, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల విధి నిర్వహణ నుంచి పదవీ విరమణకు మూడేళ్ల లోపు ఉన్న ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులు, మహిళా ఉద్యోగులను ప్రధానంగా గర్భిణులకు మినహాయింపు ఇస్తూ అన్ని జిల్లాల రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.

అకౌంట్లను అప్‌డేట్ చేస్తాం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా జెడ్పీ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ అకౌంట్లను అప్‌డేట్ చేస్తామని డిప్యూటీ సీఈఓ మున్ని పేర్కొన్నారు. ఈమేరకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను జిల్లా పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అనంతరం అకౌంట్లలో వస్తున్న సమస్యలను ఆమెకు వివరించారు. దీంతో ఆమె సానుకులంగా స్పందిస్తూ పరిష్కరిస్తామని తెలిపారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

జడ్చర్ల: బెల్టు షాపులపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. జడ్చర్ల, బూరెడ్డిపల్లిలలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు వంద లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని..ఈమేరకు బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

ప్రజలను మోసం చేయలేరు



మాట్లాడుతున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కొకుంట్లలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

సాక్షినెట్‌వర్క్ : ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేపట్టారు. అదేవిధంగా పార్టీ కార్యాలయాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించారు.

● బీఆర్‌ఎస్ తన మేనిఫెస్టోతో ప్రజలను మోసం మరోసారి చేయలేరని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీకొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ మహిళలకు రూ.2500లు ఇస్తామంటే విమర్శించిన మంత్రి హరీష్‌రావు ఇప్పుడు రూ.3వేలు ఇస్తామని ఏ విధంగా మేనిఫెస్టోలో ప్రకటించారని ప్రశ్నించారు. పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని విద్యావ్యవస్థను ప్రభుత్వం భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

● కొకుంట్లలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బీఆర్‌ఎస్‌ను తరిమి కొడదామని పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం నంచర్లలో కాంగ్రెస్‌లో చేరికల కార్యక్రమం నిర్వహించారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీసంఖ్యలో నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, కుమతం శ్రీనివాస్‌రెడ్డి, కేఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కేసీఆర్ బూటకపు హామీలను ప్రజలు నమ్మరని డీసీసీ అధ్యక్షుడు జి. మధుసుదన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం భూత్పూర్‌లో పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ అధికారులను బదిలీ చేయాలి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: దీర్ఘకాలికంగా ఎక్సైజ్‌శాఖలో పనిచేస్తున్న అధికారులను వెంటనే బదిలీ చేయాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లకుపైగా దీర్ఘకాలికంగా ఒక చోట పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీకి తనను ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడిగా నియమించినందుకు గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థులు, ఉద్యోగులు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలను తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపడతాం

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో త్వరలో విద్యార్థులకు భారత్‌కో జాన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తామని బీవీపీ జిల్లా అధ్యక్షులు రమేష్‌చందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. సభ్యులు జి.పాండురంగం, వీఎస్ఆర్‌కే.ప్రసాద్, భూషణ్‌పాండే, చంద్రుడు, రాంచందర్, వెంకటేశ్వర గుప్తా తదితరులు ఉన్నారు.

సాహితీవేత్తకు ఘననివాళి

జడ్చర్ల టౌన్: సాహితీవేత్త గోనెల ఆంజనేయులుకు సోమవారం పట్టణంలో సంస్కారభారతి ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ, ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, సభ్యులు శిరీష, సరిత పాల్గొన్నారు.

సయ్యద్ అహ్మద్‌ఖాన్ జయంతి



స్టేషన్ మహబూబ్‌నగర్: అలీఘడ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ జయంతి వేడుకలను అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శించారు. అధ్యక్షుడు జహంగీర్‌బాబా, సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, జవాద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కొప్పులోని పువ్వమ్మా.. బాయికాడి బొడ్డెమ్మ



చిన్నచింతకుంటలో బతుకమ్మ ఊరేగింపులో జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఆల మంజుల



జిల్లాకేంద్రంలో బతుకమ్మ వేడుకలు..

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జిల్లా కేంద్రం సమితి బాలికల వసతి గృహం ఆవరణలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కళాశాల చైర్మన్ శ్రీనివాసయ్య, అకాడమిక్ డైరెక్టర్ రజినీకాంత్, విశ్వనాథం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి నివాసంలో గ్రామానికి చెందిన మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మను అలంకరించారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, ఎంపీటీసీ ఉషారాణి పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో వేడుకల్లో రెడ్డి సేవాసమితి మహిళా విభాగం ప్రతినిధులు



జిల్లాకేంద్రంలో స్టాన్లీ స్కూల్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు